ఈ రోజు జరిగిన కా॥ మల్లు స్వరాజ్యం సంస్మరణ సభ నోట్‌ను ప్రచురణార్థం పంపుతున్నాము – **జె.జయరాం, ఆఫీసు కార్యదర్శి**

**తేది : 19 మార్చి, 2023.**

# స్వచ్ఛ రాజకీయాలకు స్వరాజ్యం స్ఫూర్తి
# సంస్మరణ సభలో వక్తలు

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు, మాజీ కేంద్ర కమిటీ సభ్యులు కా॥ మల్లు స్వరాజ్యం గారి ప్రథమ వర్ధంతి సభ సిపిఐ(ఎం) రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో బాలోత్సవ భవన్‌లో ఈ రోజు జరిగింది. సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కా॥ డి.రమాదేవి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, పూర్వ కార్యదర్శి పి.మధు, సిపిఐ కార్యదర్శివర్గ సభ్యులు కా॥ ఎ.వనజ పాల్గొన్నారు.

కా॥ మల్లు స్వరాజ్యం ప్రథమ వర్ధంతి, సిపిఐ(ఎం) మాజీ ప్రధాన కార్యదర్శి కా॥ ఈఎంఎస్ నంబూద్రిపాద్ 25వ వర్ధంతి సందర్భంగా నివాళులు అర్పించడం జరిగింది. సభ వీరిరువురికీ నివాళులర్పించింది. కా॥ నంబూద్రిపాద్, కా॥ మల్లు స్వరాజ్యం గార్ల మధ్య చాలా సారూప్యత ఉందని కా॥ శ్రీనివాసరావు అన్నారు. భూస్వామ్య వర్గంలో పుట్టినప్పటికీ వారికే వ్యతిరేకంగా కార్మిక వర్గానికి నాయకత్వం వహించి ఉద్యమాన్ని నడిపించారని చెప్పారు. ఈ రోజుల్లో రాజకీయ రంగం అంటే అత్యధిక లాభాలు సంపాదించుకునే వ్యాపారంలా మార్చేశారని కానీ ఆ రోజుల్లోనే ప్రజాప్రతినిధులు నిరాడంబరంగా, ఆదర్శవంతంగా, నిజాయితీగా ఎలా జీవించాలో వారిద్దరూ నిరూపించారని కొనియాడారు. ఆనాటి కేంద్ర కాంగ్రెస్ ప్రభుత్వం కేరళలో రెండు సార్లు యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వాన్ని కూల్చేసినా ముఖ్యమంత్రిగా నంబూద్రిపాద్ ఆ రెండు సంవత్సరాల్లోనే కేరళలో భూసంస్కరణలు, విద్యాచట్టం, మహిళలకు హక్కులు, దేవాలయ భూములను ప్రభుత్వ స్వాధీనంలోకి తేవడం, కౌలురైతులకు చట్టం, సహకారం రంగాన్ని బలోపేతం చేశారని తెలిపారు. అదే విధంగా మహిళలు ఆత్మగౌరవంతో ఎలా ఉండాలో చూపిన యోధురాలు కా॥ మల్లు స్వరాజ్యం అని, ఆ రోజుల్లోనే గుర్రపు స్వారీ చేసి స్వయంగా గ్రామాలు తిరుగుతూ ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చారన్నారు. శత్రువులపై పోరాడే ధీరులుగా మహిళలను తీర్చిదిద్దారు. ఆనాటి నుండి సోవియట్ యూనియన్ కూలిపోయినప్పుడు, కమ్యూనిస్టు ఉద్యమం తీవ్ర దాడిని ఎదుర్కొంటున్న సందర్భాల్లోను కూడా మానవజాతి విముక్తికి కమ్యూనిజం తప్ప మరో దారి లేదని నమ్మి ఆ మార్గంలోనే నడిచారని అన్నారు.

తెలంగాణా సాయుధపోరాటం భారతదేశానికి ఎన్నో విలువైన పాఠాలు నేర్పిందన్నారు. భూసంస్కరణలు కోసం పోరాడాల్సిన ఆవశ్యకతను తెలియజేసింది. 1970లో కమ్యూనిస్టు పార్టీ పోరాటాల వల్ల భూసంస్కరణలు అమలు జరిపి అసైన్డ్ భూములు పేదలకు పంచారు. కానీ ఇప్పుడు రివర్స్ భూసంస్కరణలు అమలు చేస్తూ పేదల అసైన్డ్ భూములను కార్పొరేట్లకు కట్టబెట్టేస్తున్నారని విమర్శించారు. దక్షిణాసియా దేశాల్లో సంక్షోభం తీవ్ర స్థాయిలో ఉందని మన దేశంలో స్వాతంత్ర్యోద్యమం పునాదిగా ఏర్పడ్డ రాజ్యాంగం వల్ల ప్రజాస్వామ్యం ఈమేరకైనా స్థిరంగా ఉండి దేశంలో పరిస్థితులు చేయిదాటకుండా ఉన్నాయన్నారు. బిజెపి వారు అంబేద్కర్ రాజ్యాంగం సరికాదని, మనువాదమే అసలు రాజ్యాంగంగా తెరమీదకి తీసుకువచ్చే కుట్రలు పన్నుతున్నారని అన్నారు. కమ్యూనిజం పాతబడిపోయిందని వ్యాఖ్యలు చేస్తూ అంతకన్నా ముందు నుండి ఉన్న మనువాదాన్ని (వేదాలు) ఇప్పుడు ఎలా సమర్థిస్తారని ఎద్దేవా చేశారు. నైజాంకు వ్యతిరేకంగా పోరాడడం అంటే ముస్లింలకు వ్యతిరేకంగా పోరాడడం కాదు. భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడడమేనని, ఆ పోరాటం వల్లే గ్రామాలలో స్వయం పాలనను సాధించారని పేర్కొన్నారు. ఇప్పటి రాజకీయ పార్టీలు కార్మిక వర్గ ఐక్యతను కులాల ఐక్యతగా మార్చేస్తున్నారన్నారు. అగ్రకులాలకు కాదు పెట్టుబడిదారులకు వ్యతిరేకంగా పోరాడడమే సమానత్వం సాధించడానికి మార్గం అన్నారు.

టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైసిపి సాధించింది కూడా ఒక గెలుపేనా అని ప్రశ్నించారు. ప్రైవేటు టీచర్ల సంక్షేమం గురించి ఎన్నడూ పట్టించుకోని ప్రభుత్వం ఎన్నికల్లో బెదిరించి, ప్రలోభపెట్టి ఓట్లు వేయించుకోవడం సిగ్గుచేటన్నారు. గ్లోబల్ సమ్మిట్ పేరుతో రాష్ట్రంలోకి వచ్చిన పెట్టుబడులన్నీ స్వదేశీ కార్పొరేట్లు మన దేశంలో దోచుకున్న సంపదేనని, ఇప్పటి వరకు విదేశాల్లో ఆస్థులు కొనుక్కోవడానికి వాడుకుంటున్నదాన్ని కాళ్ళూ, గడ్డాలు పట్టుకుని పెట్టుబడులుగా పెట్టించుకున్నారు తప్ప వారు సాధించిన ఘనత కాదని విమర్శించారు. సోలార్ పవర్, హైడల్ ప్రాజెక్టులు, గ్రీన్ పవర్ పేరుతో ప్రతి జిల్లాలోను అదానీకి భూములు కట్టబెడుతున్నారన్నారు. మోదీ బినామీ అదానీ అన్నట్లుగా వ్యవహరిస్తున్నారన్నారు. సోలార్ ప్రాజెక్టులతో ఒక ఎకరా భూమికి నెలకు 10 లక్షల వరకు లాభం సంపాదించుకుంటూ రైతులకు మాత్రం సంవత్సరానికి 30 వేలు కౌలు ఇవ్వడం వారిని నిలువునా దోచుకోవడమే అన్నారు. ఆ భూములు రైతులు తిరిగి కావాలనుకుంటే ఇచ్చేందుకు ఎటువంటి చట్టం, ఒప్పందం లేకుండా చేశారన్నారు. రాజధాని తాము ఇచ్చిన భూములకు కౌలు రాక గందరగోళంలో ఉన్నారని, రేపు రేపు అదానీ కంపెనీలకు భూములిచ్చిన రైతుల పరిస్థితి కూడా ఇదేనని హెచ్చరించారు. వీటన్నింటినీ ఎదుర్కొని నిలబడడానికి కార్మిక వర్గమే ఛాంపెయిన్ చేస్తుందని రానున్న కాలంలో పెట్టుబడిదారులకు వత్తాసు పలుకుతున్న ప్రభుత్వాలకు కమ్యూనిస్టులే పోరాటాల ద్వారా సమాధానం చెబుతారని తెలిపారు. ఈ సభలో సిపిఐ(ఎం) పార్టీ ప్రచురించిన “పేలిపోతున్న అదానీ బుడగ” పుస్తకాన్ని ఆవిష్కరించారు.

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎ.వనజ మాట్లాడుతూ కా॥ స్వరాజ్యం వంటి వారు ప్రాణాలకు తెగించి పేద ప్రజల పక్షాన నిలిచి పోరాటాలు చేశారన్నారు. వారు చేసిన త్యాగాలు, వారు అనుభవించిన జీవితం మనకు స్ఫూర్తినిస్తుందని ఆ ఆదర్శంతోనే ప్రజాపోరాటాలు నడపాలని అన్నారు.

సిపిఐ(ఎం) నాయకులు పి.మధు మాట్లాడుతూ వర్తమానంలో మనం చేయాల్సిన కర్తవ్యాలను పోరాటాలు చేసిన మహనీయులకు నివాళులు అర్పిస్తూ మననం చేసుకోవాలన్నారు. 70 సంవత్సరాలలో ఎన్నడూ లేనంతగా ఈనాడు ఆటవిక రాజ్యం రాష్ట్రంలో నెలకొందని విమర్శించారు. అధికారులు, ప్రభుత్వ విభాగాలు అన్నీ మంత్రులు, ఎమ్మెల్యేల కనుసన్నల్లో కదులుతున్నాయని అన్నారు. ప్రపంచ దేశాల్లో ఎప్పుడూ లేనంతగా కార్మిక పోరాటాలు పెరిగాయని, ఇక్కడ కూడా అదే పరిస్థితి రానుందని కార్పొరేట్ శక్తులకు, ప్రభుత్వ నిర్బంధానికి వ్యతిరేకంగా కమ్యూనిస్టులు కార్మికుల్ని, రైతుల్ని సంఘటితం చేసి పోరాటాలను ఉధృతం చేస్తారన్నారు.